క్లుప్తంగా

ఆదర్శస్కూల్‌లో మిగులు సీట్లకు దరఖాస్తులు

రొంపిచెర్ల: రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలలో మిగిలిన సీట్లకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సరళ అన్నారు. ఆమె శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 6, 7, 8, 9, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో సీట్లు మిగిలి ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 24వ తేదీ విద్యార్థులకు ఆదర్శ పాఠశాలలో రాత పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రైల్వే స్టేషన్లో తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపడుతున్న రైల్వే పోలీసులు

కుప్పంరూరల్: రైళ్లల్లో గంజాయి రవాణా అవుతుందన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో కుప్పం మీదుగా రైళ్లు, ప్లాట్‌ఫారంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. శనివారం ఆర్పీఎఫ్ అధికారులు కుప్పం రైల్వే పోలీసులకు గంజాయి రవాణాపై సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కుప్పం పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు బెంగళూరు–చెన్నై మధ్య రాకపోకలు సాగించే రైళ్లను తనిఖీలు చేశారు. అదేవిధంగా కుప్పం 1, 2, ప్లాట్‌ఫారంలను తనిఖీ చేసి ప్రయాణికుల బ్యాగులు, లగేజీలను చెక్ చేశారు. కాగా ఎవరి వద్దా గంజాయి, నిషేధిత ఏవీ దొరకలేదని తెలిసింది. తనిఖీల్లో రైల్వే పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అఖండ హరినామస్మరణ



భజనలు చేస్తున్న భక్తులు

వి.కోట: పట్టణంలో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం భక్తులు అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి భజనలు చేపట్టడంతో ఆలయ ప్రాంగణం స్వామివారి నామస్మరణతో మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త సీతారామయ్య మాట్లాడుతూ దాదాపు 10 సంవత్సరాలుగా ప్రతి శనివారం భక్తులచే అఖండ హరినామస్మరణతో భజన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఎంఎంఎంఎస్‌కు ముగ్గురు ఎంపిక



రుచిత, అజ్వతసీమ్, రెడ్డి లక్ష్మి

సదుం: నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్ షిప్‌నకు ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జయకుమార్ రెడ్డి శనివారం తెలిపారు. 8వ తరగతి విద్యార్థులు రుచిత, అజ్వతసీమ్, రెడ్డిలక్ష్మి ఎంపికయ్యారని చెప్పారు. వీరికి ఇంటర్ వరకు ప్రతి సంవత్సరం రూ.12 వేల నగదు ప్రోత్సాహకం అందుతుందని వివరించారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

ఎర బుట్టల సరఫరా



మామిడి తోటల్లో పండు ఈగ నివారణకు కొమ్మలకు కట్టిన బుట్ట

తవణంపల్లె: మామిడి పంటను ఆశిస్తున్న పండు ఈగ నివారణకు రైతులు ఎర బుట్టలు వాడి పంటను కాపాడుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి సాగరిక తెలిపారు. వర్షాలు ముందుగా రావడంతో మామిడి పంటను పండు ఈగ అధికంగా ఆశిస్తుందని పేర్కొన్నారు. దీని నివారణ కోసం ఉద్యాన శాఖ ద్వారా మామిడి రైతులకు రాయితీతో ఎర బుట్టలు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఒక్కొక్క బుట్ట సబ్సిడీతో రైతులకు రూ.11కు సరఫరా చేస్తామన్నారు. ఎకరాకు 8 బుట్టలు వాడాలని, 2–5 హెక్టార్లకు 20 బుట్టలు వినియోగించవచ్చని సూచించారు. ప్రతి రైతుకు 40 బుట్టల వరకు ఇస్తామన్నారు. పండు ఈగలు బుట్టలో పడి చనిపోతాయని పేర్కొన్నారు. బంగారుపాళ్యం రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మామిడి రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసుకొచ్చి డబ్బులు చెల్లించి బుట్టలు తీసుకోవచ్చని వివరించారు.

ఆశావహుల్లో నిరాశ..

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో ఇప్పటివరకు నామినేటెడ్ పోస్టులు భర్తీ కాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా నామినేటెడ్ పోస్టులపై స్పష్టత రాలేదు. రేపు..ఎల్లుండి.. వచ్చే నెల.. వచ్చే సంవత్సరం గడిచిపోయింది. ఆశావహుల్లో మాత్రం ఎప్పటికి పదవులు వరిస్తాయో అని నైరాశ్యంలో ఉండిపోయారు. కుప్పంలో ప్రధాన ఆదాయ వనరులైన రెస్కో, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులపైనే చర్చ సాగుతోంది. తమకే పదవులు దక్కుతాయని ఇప్పటికే కొంతమంది నాయకులు ఆయా శాఖలపై ఆధిపత్యానికి దిగుతున్నారు.

- కుప్పంలో నామినేటెడ్ పదవుల భర్తీ ఎప్పటికో..?
- నైరాశ్యంలో ఆశావహులు
- అదిగో.. ఇదిగో.. అంటూ నాన్చుతున్న అధినేత
- ఏడాది గడిచినా పదవుల భర్తీపై రాని స్పష్టత
- అందరి దృష్టి ప్రధానంగా రెస్కోపైనే!
- అధినేత నిర్ణయమే ఫైనల్?

కుప్పంరూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా బాబు సొంత నియోజకవర్గం కుప్పంలో మాత్రం నామినేటెడ్ పదవుల భర్తీ జరగలేదు. రాష్ట్రం మొత్తం మార్కెట్ కమిటీలు, ఆలయాల చైర్మన్లు, పాలకమండళ్ల భర్తీ జరిగినా కుప్పంలోని రెస్కో, మార్కెట్ కమిటీ, సింగిల్‌విండో, ఆలయాల పాలక వర్గాల నియామకంలో ఇప్పటికీ నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఆశావహుల్లో గుబులు ఓ వైపు.. పదవులు ఎప్పటికీ వస్తుందో అనే నైరాశ్యం మరోవైపు నెలకొంది. జనం మాత్రం త్వరగా నామినేటెడ్ పదవుల పంచాయతీ తేల్చితే అభివృద్ధికి దోహదపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అందరి చూపు వాటి వైపే..



రెస్కో కేంద్ర కార్యాలయం

కుప్పంలో ఆదాయ వనరులు ఉన్న నామినేటెడ్ పదవుల్లో రెస్కో (గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ), మార్కెట్ కమిటీలే ప్రధానమైనవి. రాష్ట్రంలోని మూడు మార్కెట్‌లో అనకాపల్లి, చీపురుపల్లి రెస్కోలు ఏపీ ఎస్‌పీడీసీఎల్ ఆధీనంలోకి వెళ్లిపోయాయి. మిగిలింది కుప్పం రెస్కో మాత్రమే. మంచి ఆదాయ వనరుగా ఉన్న రెస్కో చైర్మన్ పదవిపైనే కూటమి నేతల కళ్లు ఏకీకృతమయ్యాయి. మొదట్లో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నుంచి టీడీపీలోకి వచ్చిన డా.సురేష్‌బాబు ప్రధానంగా వినిపించినా, అతను రాష్ట్రస్థాయి ఆశిస్తున్నట్లు తెలియడంతో ఇప్పుడు ఎవరికి వరిస్తోందనే చర్చసాగుతోంది. ప్రధానంగా కమతమూరు మాజీ సర్పంచ్ వీజీ ప్రతాప్, మున్సిపాలిటీ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, శాంతిపురం మండల పార్టీ ప్రెసిడెంట్ విశ్వనాథ్‌నాయుడు, రామకుప్పం పార్టీ ప్రెసిడెంట్ ఆనందరెడ్డి, గుడుపల్లెకు చెందిన చంద్రశేఖర్‌లో ఎవరికో ఒకరికి దక్కుతుందనే చర్చసాగుతోంది. వీరిలో ప్రతాప్, ఆనంద్‌రెడ్డిలో ఎవరికో ఒకరికి దక్కుతుందనే ప్రధానంగా వినిపిస్తున్న మాటలు. ప్రతాప్ గాండ్ల, ఆనం దొరెడ్డి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఈ సామాజిక వర్గాలకు ఇప్పటివరకు ఎవరికి నామినేటెడ్ పదవులు రాకపోవడం వీరికి బలాన్ని ఇస్తోంది. ఒక మార్కెట్ కమిటీ విషయానికి వస్తే తంబిగానిపల్లి కాణిపాకం వెంకటేష్, యువత అధ్యక్షుడు సుబ్రమణ్యం, రామకుప్పం ఆంజనేయ రెడ్డి, మునస్వామి, బలిజ సామాజిక వర్గానికి మరో నాయకుడు, కర్లగట్ట గ్రామానికి చెందిన ఓ యువకుడి పేరు ప్రధానంగా వినిపిస్తోంది. వీరిలో కాణిపాకం వెంకటేష్ ఇప్పటికే తనకే పదవి వస్తుందని స్నేహితులు, బంధువుల వద్ద చెప్పుకుంటున్నట్లు సమాచారం. తంబిగానిపల్లికే చెందిన సెల్వంకు ఇటీవల కుప్పం మున్సిపల్ చైర్మన్ పదవి ఇవ్వడంతో వెంకటేష్‌కు కష్టమనే వాదన లేకపోలేదు. యువత అధ్యక్షుడు సుబ్రమణ్యం సైతం యువత కోటాలో తనకే ఇవ్వాలని గట్టిగా ప్రయతిస్తున్నాడు. వీరితో పాటు రామకుప్పంకు చెందిన ఆంజనేయరెడ్డి అయితే చివరి అవకాశంగా తనకు ఇస్తే బాగుంటుందని ఆశిస్తున్నాడు. మిగిలిన గుడివంక దేవాలయ పాలకవర్గం, కుప్పం షాదీమహల్, నాలుగు మండలాల సింగిల్‌విండో చైర్మన్లకు గట్టిపోటీనే ఉంది.

అధినేత నిర్ణయమే శిరోధార్యమా..!

రెస్కో, మార్కెట్ కమిటీ నియామకాలు, సామాజిక వర్గాలకు న్యాయం వంటి అంశాలు ఇప్పుడు అధినేత చంద్రబాబు మాటే శిరోధార్యం కానుంది. ఒక్కో పదవికి పదుల సంఖ్యలో ఆశావాహులు ఉండడమే ఇందుకు కారణం. స్థానికంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఉన్నా, పోటీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో నిర్ణయం అధినేతకే వదిలేసే అవకాశాలే ఎక్కువ.

వాల్మీకి, కురబలకు న్యాయం చేయాలి..

టీడీపీ ఏర్పడినప్పటి నుంచి పార్టీలో వాల్మీకి, కురబ కులాలకు పెద్దగా న్యాయం జరగలేదనేది టీడీపీ నాయకుల వాదన. వాల్మీకి కులానికి చెందిన కుప్పం మండల పార్టీ ప్రెసిడెంట్ ప్రేమ్‌కుమార్ తనకు ఏదో పదవి ఇవ్వాలని అధిష్టానాన్ని వేడుకుంటూనే ఉన్నాడు. గుడుపల్లె మండలం తొట్లిగానిపల్లి పదవి ఆశించే వారిలో ఉన్నారు. కురబ కులంలో పెద్దగా ఆశావాహులు లేకపోయినా బిరుదనపల్లికి చెందిన సంతోష్ పదవి ఆశిస్తున్న వారిలో లిస్టులోనే ఉన్నాడు. ఈ రెండు కులాల్లో ఎవరైనా ఒకరికి రెస్కో లేక మార్కెట్ కమిటీ ఇవ్వాలనే వాదన గట్టిగా వినిపిస్తోంది. ఇక బలిజ సామాజికవర్గం నుంచి పి.గోపినాథ్, సత్యేంద్రశేఖర్, భాగ్యలక్ష్మి పదవులు ఆశిస్తున్న వారి లిస్టులో ఉన్నారు. మహిళా విభాగంలో అనసూయ సైతం రాష్ట్రస్థాయి పదవి ఆశిస్తున్న వారిలో వరుసలో ఉన్నారు.

పుష్పపల్లకిపై ముత్యాలమ్మ



వెండి ఆభరణాలు సమర్పిస్తున్న దాతలు

రొంపిచర్ల: మండలంలోని పాతకురవపల్లెలో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారి పుష్పపల్లకి సేవ వైభవంగా జరిగింది. శనివారం రాత్రి ముత్యాలమ్మను పుష్పపల్లకిపై గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. అమ్మవారికి కర్పూర హారతులు పట్టి మొక్కుకున్నారు. మహిళలు సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అలాగే వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కోటా వెంకటరమణ, అటవీశాఖ సెక్షన్ ఆఫీసరు సుధాకర్, ఎక్సైజ్ సీఐ లీలారాణి, కోటా యశోదమ్మ, లోహిత్, రామచంద్రయ్య, సుష్మ అమ్మవారికి వెండి కిరీటం, కళ్లు విరాళంగా అందించారు. ఆలయంలో అన్నదానం నిర్వహించారు.



సారె తీసుకువస్తున్న మహిళలు

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్

- ఘనంగా బక్రీద్ ప్రార్థనలు
- కిటకిటలాడిన మసీదులు
- దానధర్మాలు చేసిన ముస్లింలు

పలమనేరు: త్యాగనిరతికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాలకు చేరుకుని నమాజు చేశారు. పేదలకు శక్తి మేరకు దానధర్మాలను చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు, గురువులు త్యాగాలకు ప్రతీకైన బక్రీద్ గురించి దాని ప్రాశస్త్యం గురించి వివరించారు. ప్రతి ముస్లిం జీవితంలో హజ్ యాత్ర పరమార్థం గురించి తెలియజేశారు. జంతు మాంసాలను కొంత పేదలకు, కొంత బంధుమిత్రులకు, మిగిలింది కుటుంబాలకు ఇలా మూడు భాగాలుగా చేసి వండుకుంటారు. అందుకే దీన్ని త్యాగాల పండుగ అంటారని తెలిపారు. అనంతరం కుర్బానీ ప్రాశస్త్యాన్ని వివరించారు. బక్రీద్ సందర్భంగా పలమనేరు నియోజకవర్గ ముస్లింలకు స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలో బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. పేదలకు దానధర్మాలు చేశారు. పెద్దపంజాణి జెడ్పీటీసీ సుష్మకీర్తి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ భాగారెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: మండలవ్యాప్తంగా బక్రీద్‌ను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మశీదుల నుంచి ఈద్గాకు ర్యాలీగా వెళ్లారు. బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీ. అందులో భాగంగా దానధర్మాలు చేశారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండలవ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఈద్గా వద్దకు చేరుకుని ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు దానధర్మాలు చేశారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండల పరిధిలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో బక్రీద్ జరుపుకున్నారు. ఉదయం మసీదుల్లో ప్రార్థనలు చేపట్టారు. వర్షాలు బాగా కురిసి రైతులు ఆనందంగా ఉండాలని అల్లాను ప్రార్థించారు.



పలమనేరు ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మంగళంపేటలో ఈద్గాలో..



బైరెడ్డిపల్లె ఈద్గాలో ..



చిన్నేపల్లి ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రొంపిచెర్ల ఈద్గాలో..



చౌడేపల్లెలో ఈద్గా వద్దకు వెళ్తున్న ముస్లింలు

అమ్మాయాక్స్ సేవలు ఎనలేనివి



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే

వి.కోట: పేదప్రజలకు అనేక సేవాకార్యక్రమాలు, విద్యార్థులకు ఎన్నో ఉపకరణాలు, ప్రోత్సాహకాలు అందిస్తూ ఆదర్శవంతంగాగా ముందుకెళ్తున్న సంస్థ అమ్మాయాక్స్ సేవలు ఎనలేనివని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కొనియాడారు. శనివారం పట్టణంలోని జీఎంఆర్ కల్యాణ మండపంలో అమ్మాయాక్స్ సంస్థ 28వ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సంస్థ అధినేత దశరథరెడ్డి అతిథులకు స్వాగతం పలికారు. అనంతరం జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే చేతుల మీదుగా 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గోల్డ్ మెడళ్లతో సత్కరించి, నగదు బహుమతులు ప్రదానం చేసి ప్రోత్సాహకాలు అందించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ వి.కోటలో సంస్థ ఏర్పాటు చేసిన నాటి నుంచి దశరథరెడ్డి ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. సేవా కార్యక్రమాలతో పాటు ఎన్నో ప్రభుత్వ పాఠశాలలకు డెస్కులు, ఆర్‌ఓ ప్లాంట్‌లు సమకూర్చడం, హాస్టళ్ల విద్యార్థులకు అవసరమైన దుప్పట్లు, నోట్ బుక్కులు అందించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్, ఎంపీడీఓ ఈశ్వరయ్య, సీఐ, సంస్థ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

13న ముత్యాలమ్మ జాతర

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఈనెల 13వతేదిన చిత్తూరు నగరంలోని తేనేబండలో ముత్యాలమ్మ జాతరను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈవో వెంకట్రాయులు తెలిపారు. మధ్యాహ్నం 1 గంటలకు అభిషేకం జరుగుతుందన్నారు. సాయంత్రం 6గంటలకు సింహవాహనంపై అమ్మవారిని ఆశీనులు చేసి కొండచుట్టూ తిరునాళ్లు, రాత్రి 9 గంటలకు పుష్పపల్లకిపై అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొన్ని అమ్మవారి జాతరను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం

యాదమరి: మండల కేంద్రంలోని ఇంద్ర వరదరాజ స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి నిర్వహించిన పుష్పపల్లకి ఉత్సవంతో పరిపూర్ణమయ్యాయి. అర్ధరాత్రి దేవదేవుడు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్వామి వారి పుష్ప పల్లకి ఉత్సవం కనుల పండువలా సాగింది. ముందుగా స్వామి అమ్మవారి మూలవార్లకు సుగంధ భరితమైన పరిమళ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాది పూజలు గావించారు.

బాలికపై లైంగికదాడి దారుణం

తిరుపతి కల్చరల్ : శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం, ఏడు గుర్రాలపల్లెలో దళిత మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడడం దారుణమని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.అరుణ, అలివేలు, రాఘవేంద్ర, నగేష్ డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ బాలికను బ్లాక్ మెయిల్ చేసి 14 మంది ఆరునెలలపాటు లైంగికదాడి చేయడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. మహిళలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

15న కళాకారుల సమ్మేళనం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): కళావికాసంలో భాగంగా కళాకారుల సమ్మేళన కార్యక్రమాన్ని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, ఎం.వి.కేశవ రెడ్డి స్మారక్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ నెల 15న చిత్తూరులో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎం.వి.శ్రీధర్‌రెడ్డి, సి.నారాయణస్వామి తెలిపారు. చిత్తూరు నగరంలోని సమాఖ్య కార్యాలయంలో కళాకారుల సమేళన కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యంత వైభవోపేతంగా జరగనున్న ఈ జాతీయస్థాయి ద్విశతాధిక కళాకారుల మహోత్సవం వండర్‌బుక్స్ ఆఫ్ రికార్డ్ ఇంటర్నేషనల్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు కానుందని వారు వెల్లడించారు. దీనికి అందరూ ఆహ్వానితులేనన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.మునీంద్ర, పి.రోహిత్, కె.ఆనందనాయుడు, కేశరు సింగ్, కోటీశ్వర మొదలియార్, జి.భూపతి, రాజేంద్రన్, నాగరాజు, రంగనాథన్, ప్రకాష్ పాల్గొన్నారు.

చిత్తూరు బస్టాండులో

డిపోల రగడ



తిరుపతి పాయింట్ వద్ద కార్మికులు



పోటాపోటీగా ఆపిన బస్సులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండులో శనివారం వన్ డిపో–టూడిపో బస్సులు ఢీకొన్నాయి. రెండు డిపోలు తిరుపతి ప్లాట్‌ఫామ్‌లో ఒకటో పాయింట్ కోసం పోటీపడ్డాయి. నువ్వా–నేనా అంటూ తలపడ్డాయి. చివరికి ఢీకొట్టుకున్నాయి. దీంతో వన్‌డిపో బస్సు వెనక వైపు దెబ్బతింది. వివరాల్లోకి వెళితే.. గత 8 నెలలుగా చిత్తూరు వన్‌డిపో–టూ డిపోకు మధ్య పోరు నడుస్తోంది. తిరుపతికి తామే తిప్పాలని వన్ డిపో కార్మికులు పట్టుపడుతున్నారు. టూ డిపో అధికారి గంగాధరనెల్లూరు రూట్‌లో తిరుగుతున్న బస్సులను తిరుపతికి మళ్లించారని వారు రాతపూర్వకంగా అధికారులకు ఫిర్యాదు చేశారు. తమ బస్సులు తిరగాల్సిన రూట్‌లో టూడిపో బస్సులు తిరగడం ఏమిటని ప్రశ్నిస్తూ వచ్చారు. అయితే ఈ తంతూ ఇటీవలే కాస్త సద్దుమణిగింది. మళ్లీ శుక్రవారం నుంచి ఈ రెండు డిపోల మధ్య వివాదం తలెత్తింది. బస్టాండులోని తిరుపతి ప్లాట్‌ఫామ్‌లో ఒకటో పాయింట్‌కోసం పట్టుపడుతున్నారు. శనివారం ఉదయం 7 గంటలకు తిరుపతి ప్లాట్‌ఫామ్‌లోని ఆ పాయింట్‌లో బస్సు పెట్టేందుకు రెండు డిపో బస్సులు పోటీపడ్డాయి. ఈ క్రమంలో గొడవ ప్రారంభమైంది. రెండు డిపోలకు సంబంధించిన యూనియన్ నాయకులు అక్కడకు చేరుకున్నారు. దీంతో వారి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అరుపులు, కేకలతో దద్దరిల్లింది. ఈ క్రమంలో రెండు బస్సులు రాసుకుంటూ ఢీకొట్టుకున్నాయి. దీంతో వన్‌డిపో బస్సు వెనుక భాగంలో దెబ్బతింది. ఇదంతా డిపో–2కు సంబంధించిన ఓ అధికారే కారణమని, ఇంత జరుగుతున్న డిపో అధికారులు చోద్యం చూడడంపై యూనియన్ వర్గాలు మండిపడుతున్నాయి. ఈ సమస్యపై అధికారులే పట్టించుకోన్నప్పుడు మనమెందుకు గొడవ పడాలని వాళ్లకు వాళ్లే సర్దుకున్నారు. ఈ విషయం మీడియా వరకు వెళ్లడంతో అక్కడి నుంచి కార్మికులు మాయమయ్యారు.

నేడు కంటి వైద్యశిబిరం

సదుం: స్థానిక వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో మానవత స్వచ్ఛంద సంస్థ, అరవింద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించే శిబిరంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. అవసరమైన వారిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేస్తామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గోసంరక్షణ ట్రస్టుకు విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన గోసంరక్షణ ట్రస్టుకు శనివారం పలువురు దాతలు విరాళం అందించారు. చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లికి చెందిన చంద్రస్ కుటుంబ సభ్యులు రూ.లక్ష, విజయవాడకు చెందిన మల్లికార్జున కుటుంబ సభ్యులు రూ.ఒక లక్ష విరాళం అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు దాతల కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



విరాళం అందజేస్తున్న విజయవాడకు చెందిన దాతలు



చిత్తూరుకు చెందిన దాతలు...